
# బానిస



-బి హెచ్.వి.నాగేశ్వరరావు

టేబుల్ మీద పేరుకుపోయిన ఫైళ్ళను క్లియర్ చేయడంలో తలమునకలై ఉన్న కేశవరావు "మిమ్మల్ని మేనేజర్‌గారు పిలుస్తున్నారు సార్!'' అన్న మాటలకు తలెత్తాడు.

చూస్తున్న ఫైల్‌ని మూసి మేనేజర్ రూంలోకి వెళ్లాడు.

అతని కోసమే ఎదురుచూస్తున్న మేనేజర్ అతన్ని చూడగానే ఒక్కసారిగా భగ్గుమన్నాడు. చేతిలోని హెడ్ ఆఫీసునించి తిరిగొచ్చిన స్టేట్‌మెంట్స్‌ని అతని పైకి విసిరి "ఏంటయ్యా! హెడ్ ఆఫీసుకి స్టేట్‌మెంట్స్ ఇలాగేనా తప్పులు పంపేది?'' అంటూ చీవాట్లు లంకించుకున్నాడు.

"సార్! అవి కంప్యూటర్‌లో తీసిన స్టేట్‌మెంట్స్ కదా! కరెక్టుగానే ఉంటాయి కదా అని...'' అంటూ నీళ్ళు నమిలాడు కేశవరావు.

"కంప్యూటర్‌లో తీస్తే మాత్రం వాటిని చెక్ చేయనక్కర్లేదనుకున్నావా? అసలు ప్రతీదీ మాన్యువల్‌గా చెక్ చేయకుండా ఎలా పంపిస్తున్నావయ్యా! వీటన్నింటినీ చెక్‌చేసి మరలా పంపించు'' అంటూ తాఖీదిచ్చాడు.

ముఖం వేలాడేసుకుని తన సీటు వద్దకు వచ్చాడు కేశవరావు.

"ఏంటి గురూ సంగతి? ఏమంటాడు బాస్?'' తన ఫైల్లోంచి తలెత్తకుండానే అడిగాడు పక్కసీటు లోని రాజారావు.

"ఏం చెప్పమంటావు గురూ. హెడ్ ఆఫీసుకి స్టేట్‌మెంట్లు కంప్యూటర్‌లో తీసి పంపించాను. వాటిల్లో తప్పులున్నాయని తిరగ్గొట్టారు. స్టేట్‌మెంట్లు చెక్ చేయకుండా ఎందుకు పంపావని తిడుతున్నాడు'' సమాధానం చెప్పి తప్పుడు స్టేట్‌మెంట్స్ ఇచ్చిన కంప్యూటర్‌నీ, ప్రోగ్రామ్ తయారు చేసిన ప్రోగ్రామర్‌నీ తిట్టుకుంటూ, స్టేట్‌మెంట్స్ ఒక్కొక్కటీ తీసి మ్యాన్యువల్‌గా చెక్ చేయడం మొదలుపెట్టాడు కేశవరావు.

ఈ కంప్యూటర్ వచ్చి రెండేళ్లయింది. అందంగా ఒక మూల అమరిన కంప్యూటర్‌ని చూసి స్టాఫ్ మురిసిపోయారు. ఈ చేత్తో చేసే పని తగ్గి కొంచెం హాయిగా ఉంటుందని సంబరపడ్డారు. తాముచేసే గాడిద చాకిరీ అంతా తాను తీసుకుని తమకు అందమైన బానిసలా పడి ఉంటుందని గర్వపడ్డారు. అనుకున్నట్టే పని తగ్గడం మొదలయ్యింది.

అయితే అనుకోని పరిణామం ఇంకోటి జరిగింది. పక్క సెక్షన్‌లో ఖాళీ అయితే ముగ్గుర్ని ఈ సెక్షన్‌నుంచి అక్కడకు మార్చేశారు. ఇద్దరు రిటైర్ అవ్వడం వల్ల ఒకరు వేరేచోట మంచి ఉద్యోగం దొరకడం వల్ల వెళ్లిపోయారు.

కంప్యూటర్ ఉందిగా మరింకేం అంటూ మరి ఎవరినీ రిక్రూట్ చేయలేదు.

దాంతో సెక్షన్ మొత్తానికి కేశవరావు, రాజారావే మిగిలారు. ఇవతల ఏడాదికేడాది ట్రాన్‌శాక్షన్స్ పెరుగుతూ పని 'ఇంతింతై వటుడింతై' అన్నట్లు పెరిగిపోసాగింది.

దాంతో ఇంతకుముందు చేత్తోనే కష్టపడి చేసినా సాయంత్రం ఐదయ్యేసరికి ఇంటికి వెళ్లేవారు. అలాంటిది ఇప్పుడు ఇంటికి చేరేసరికి రాత్రి పది, పదికొండు అవుతోంది.

దానికి తోడు పులిమీద పుట్రలా హెడ్ ఆఫీసు ఇచ్చిన ప్రోగ్రామ్స్‌లో తప్పులుండడం వల్ల పనిలో తప్పులు దొర్లడం మొదలయ్యింది.

దాని గురించి తాము రిపోర్టు చేస్తే ఆ ప్రోగ్రామ్ రెక్టిఫై చేసి మరో ప్రోగ్రామ్ పంపించడం, దాంట్లో ఇంకేవో తప్పులుండడం, అవి తాము తెలుసుకుని మళ్లీ రిపోర్టు చేయడం ఇలా సాగిపోతోంది.

స్టేట్‌మెంట్స్ అన్నీ పూర్తిగా చెక్‌చేసి తప్పులు దిద్ది రెడీ చేసేసరికి పూర్తిగా మూడురోజులు పట్టింది.

నెల మొదటివారంలోనే వెళ్లవలసిన స్టేట్‌మెంట్స్ లేటయ్యాయి. వాటిని మేనేజర్ సంతకానికి పంపి ఇంకో ఫైల్ తీశాడు కేశవరావు.

"మిమ్మల్ని మేనేజర్‌గారు రమ్మంటున్నారు సార్!'' అన్న ప్యూన్ మాటలకి చూస్తున్న ఫైల్ మూసి మేనేజర్ గదిలోకి వెళ్లాడు కేశవరావు.

"ఏంటయ్యా ఇది. ఇవాళ తొమ్మిదో తారీఖు. హెడ్‌ఆఫీసుకి ఈ స్టేట్‌మెంట్స్ మొదటివారంలోనే వెళ్లాలని నీకు తెలీదూ! కంప్యూటర్‌లోంచి తీసి పంపించడానికి కూడా బద్ధకమేనా? అన్నీ కంప్యూటర్ చేస్తున్నా ఇంత లేటవుతుందేం?' అరుస్తున్నాడు మేనేజర్.

'ఈ స్టేట్‌మెంట్లు కంప్యూటర్‌లోంచి తీసి పంపించేనని, అవి తప్పులని మరలా మాన్యువల్‌గా చేయడం వల్ల లేటయింది సార్' అని చెప్పాలనుకున్న మాటలు కేశవరావు గొంతులోనే ఉండిపోయాయి.

మేనేజర్ రూం అద్దంలోంచి తన సెక్షన్‌లోని కంప్యూటర్ కనబడుతోంది. తమకు బానిసలా పడి ఉంటుందని తాము మురిసిపోయిన ఆ కంప్యూటర్ తమనే బానిసలుగా మార్చేసి తాను భూతంలా మారి వికటాట్టహాసం చేస్తూ కనిపిస్తోంది. మెదడంతా శూన్యమై నీరసంగా సీటు దగ్గరకు తిరిగి వచ్చి ఇంకో ఫైల్ తీశాడు కేశవరావు.

★